విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పదం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382

www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

శుక్ర వారం
13. 05. 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
సంపుటి - 01, సంచిక-77
పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## నర్సుల సేవలు వెలకట్టలేనివి

(అంతర్జాతీయ నర్సుల దినోత్సవం)



**హైదరాబాద్, మే 12 (అక్షర వెలుగు):** ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో చేరిన వారికి సేవలు చేసే చేతులు ఏవైనా ఉంటే అవి సేవామయులైన నర్సుల చేతులే. మానవ సేవే మాధవ సేవ అంటారు. అలా మానవ సేవ ద్వారానే తమ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న వారు నర్సులు. అయిన వారు కూడా ముట్టుకోవటానికి ఇబ్బంది పడినా, ఏ మాత్రం సంబంధం లేని నర్సులు సేవలు అందిస్తున్నారు. కరోనా మహమ్మారిని కట్టడి చేయడంలో నేడు ప్రపంచవ్యాప్తంగా వైద్యులతోపాటు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. రేయింబవళ్లు రోగులను కంటికి రెప్పలా కాపాడుతూ, వారి బాగోగులు చూస్తున్నది నర్సులేననేది వాస్తవం. అందుకే వారందరికీ శిరసు వంచి ప్రణమిల్లుతోంది ప్రపంచం. తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ వారు సేవలను అందిస్తున్న తీరు నర్సుల పట్ల

2వ

# రోగుల అటెండర్లకు మూడుపూటల భోజనం

జీహెచ్ఎంసీ పరిధిలోని 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభ్యం ■ ఉస్మానియాలో ప్రారంభించిన మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, మే 12 (అక్షర వెలుగు):** జీహెచ్ఎంసీ పరిధిలోని 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల వెంట ఉండే సహాయకులకు మూడు పూటలా భోజనం అందించే కార్యక్రమాన్ని మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మానవత్వానికి మారు పేరు సీఎం కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. ఉస్మానియా ఆస్పత్రిలో మూడు పూటలా భోజనం కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం వచ్చిన తొలి రోజుల్లోనే పేదలు కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కిలో బియ్యాన్ని ఒక్క రూపాయికే అందించారని మంత్రి తెలిపారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాత్రం ఎంత మంది ఉన్న ఒక్కొక్కరికి 4 కేజీల చొప్పున.. మొత్తం 20 కేజీలకు మించకుండా ఇచ్చేవారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో ఒక్కో విద్యార్థికి 200 గ్రాముల చొప్పున ఆహారం అందించేవారు. అర్ధాకలితో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, సన్న బియ్యంతో భోజనం పెట్టాలని కేసీఆర్ ఆదేశించారు. ఇవాళ అన్ని హాస్టళ్లలో సన్నబియ్యం తో తిన్నంత భోజనం పెడుతున్నారని అన్నారు. కేసీఆర్ గతంలో ఆస్పత్రులను సందర్శించి నప్పుడు రోగుల సహాయకుల బాధలను గమనించారు. తద్వారా రోగుల సహాయకులకు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద నైట్ షెల్టర్లు నిర్మించాలని ఆదేశించారు. ఆ పని కొన్ని చోట్ల పూర్తయిందన్నారు. రోగుల సహాయకులకు కూడా భోజనం అందించాలని సూచించారు. ఈ క్రమంలోనే రోజుకు 20 వేల మందికి రూ. 5 కే అన్నం పెట్టే కార్యక్రమం ఇవాళ ప్రారంభమైంది. హరే రామ హరే కృష్ణ సంస్థతో ఒప్పందం చేసుకుని ఈ

2వ



## మౌలిక వసతుల కల్పనలో హైదరాబాద్ మిన్న

- నివాసయోగ్ ప్రాంతంగా ముందువరసలో సిటీ
- కాల్ అవే గోల్ఫ్ సంస్థ కార్యాలయ ప్రారంభంలో కెటిఆర్

**హైదరాబాద్, మే 12 (అక్షర వెలుగు):** మౌలిక వసతుల్లో దేశంలో హైదరాబాద్ అగ్రభాగాన ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలోని ఇతర నగరాల కంటే హైదరాబాద్ ఈ విషయంలో ముందున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. నివాసయోగ్యమైన నగరాల్లోనూ హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. నగరంలోని రాయదుర్గంలో ఉన్న నాలెడ్జ్ సెంటర్‌లో అమెరికాకు చెందిన కాల్ అవే గోల్ఫ్ సంస్థ కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కాల్‌అవే ఆఫీస్ ఏర్పాటవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో డిజిటెక్ కంపెనీలు చాలా ఉన్నాయని కేటీఆర్ అన్నారు. శాండియాగోలో క్వాల్కం కేంద్ర కార్యాలయం ఉంది. సంస్థ తన రెండో పెద్ద కార్యాలయం హైదరాబాద్‌లో



మౌలిక వసతుల

2వ

## పల్లె ప్రకృతి వనంలో పోషక ఉద్యానవనం



- సేంద్రియ పద్దతిలో కూరగాయల సాగు
- విత్తనాలు చల్లి ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్

**నిర్మల్, మే 12 (అక్షర వెలుగు):** పోషక ఉద్యానవనం కింద చేపట్టిన కార్యక్రమంలో ఎకరంలో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పండిస్తారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సేంద్రియ పద్దతిలో వీటిని పండించి అంగన్‌వాడీలకు సరఫరా చేస్తామని అన్నారు. జిల్లాలోని సారంగపూర్ మండలం ఆలూర్‌లోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో పోషక ఉద్యాన వనాన్ని ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఆలూరు బృహత్ ప్లలె ప్రకృతి వనంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, సమగ్ర శిశు మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 'పోషక ఉద్యానవనం', 'మన అంగన్‌వాడీలు- మన ఆకుకూరలు' అనే కార్యక్రమాన్ని వనంలో విత్తనాలు చల్లి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రయోగాత్మకంగా ఆలూరులో

2వ

## మాజీ ప్రధాని మహింద రాజపక్సకు షాక్

దేశం విడిచి వెళ్లకుండా ఆదేశాలు ● అతనిపై ట్రావెల్ బ్యాన్ విధించిన కోర్టు



**కొలంబో, మే 12 (అక్షర వెలుగు):** శ్రీలంక మాజీ ప్రధాని మహింద రాజపక్స ఆయన కుమారుడు నమల్ రాజపక్స, మరో 15 మందిపై శ్రీలంక కోర్టు ట్రావెల్ బ్యాన్ విధించింది. కొలంబోలో ఈ వారం ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలపై జరిగిన హింసాత్మక దాడిపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో కోర్టు ఈ నిర్ణయం వెలువరించింది. సోమవారం గోటాగోగామా, మైనాగోగామాలలో జరిగిన శాంతియుత నిరసనలపై జరిగిన దాడిపై దర్యాప్తు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో వీరు దేశం దాటి పోకుండా ఫోర్ట్ మేజిస్ట్రేట్ కోర్టు వారిపై విదేశీ ప్రయాణ నిషేధాన్ని విధించింది. మహింద్ర రాజపక్స, ఆయన కుమారుడితోపాటు పార్లమెంటు సభ్యులు జాన్స్టన్ ఫెర్నాండో, పవిత్ర వన్నియారచ్చి, సంజీవ ఎడిరిమన్నే, కాంచన జయరత్నె, రోహిత అబేయుగుణవర్ధనె, సీబీ రత్నాయకే, సంపత్ అతుకోరల, రేణుక పెరేరా, శాంతి నిషాంత, సీనియర్ డీఐజీ దేశబంధు తెన్నాకూన్ తదితరులు నిషేధం ఎదుర్కొంటున్న వారిలో ఉన్నారు. రెండు హింసాత్మక ఘటనల వెనక కుట్ర ఉందని, ముందస్తుగా దీనికి పథక రచన జరిగిందని పేర్కొన్న అటార్నీ జనరల్.. వారిని విచారించాల్సిన అవసరం ఉందని, కాబట్టి దేశం విడిచి పోకుండా 17 మందిపై ట్రావెల్ బ్యాన్ విధించాలని కోర్టును కోరారు. పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం వారు దేశం విడిచి వెళ్లకుండా ట్రావెల్ బ్యాన్ విధించింది. కాగా, యునైటెడ్ నేషనల్ పార్టీ (జఔఖ) నేత రణిల్ విక్రమసింఘే మరికాసేపట్లో శ్రీలంక కొత్త ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.

## అట్టడుగు వర్గాలకు చేయూత ముఖ్యం

శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు ● రాజకీయా అవినీతితో పట్టని సంక్షేమం

**న్యూఢిల్లీ, మే 9 (అక్షర వెలుగు):** సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు

2వ

## రాజ్యసభ ఎన్నికలకు మోగిన నగారా

- దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 57 సీట్లకు ఎన్నికలు
- ఎపిలో నాలుగు..తెలంగానలో 2 సీట్లకు ఎన్నిక




**న్యూఢిల్లీ, మే 12 (అక్షర వెలుగు):** పెద్దల సభకు ఎన్నికల నగారా మోగింది. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 57 రాజ్యసభ సీట్లకు ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఖాళీకానున్న రాజ్యసభ సీట్ల కోసం మే 24 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. జూన్ 1వ తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 3 వరకు గడువు ఉంటుంది. జూన్ 10న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. మొత్తం 57 సీట్లలో.. ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు, తెలంగాణ నుంచి రెండు సీట్లు భర్తీ చేయాల్సి ఉంది. ఏపీ నుంచి ఎంపీలు విజయసాయిరెడ్డి, సురేష్ ప్రభు, టీజీ వెంకటేష్, సుజనా చౌదరిల పదవీకాలం ముగియనుంది. అలాగే తెలంగాణ నుంచి కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ధర్మపురి శ్రీనివాస్‌లు రిటైర్ అవుతున్నారు. ఏపీ, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 57 రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 1న

2వ

## భోజన స్కీమ్‌ను ప్రారంభించిన తలసాని



**హైదరాబాద్, మే 12 (అక్షర వెలుగు):** గొప్ప మనసున్న మారాజు ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం గాంధీ హాస్పిటల్, ఎర్రగడ్డ లోని చెస్ట్ హాస్పిటల్ లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తో కలిసి పేషంట్ సహాయకులకు మూడు పూటల ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసిన 5 రూపాయల బోజన కేంద్రాన్ని మంత్రి శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా పేషంట్ సహాయకులతో మాట్లాడి హాస్పిటల్ లో అందిస్తున్న వైద్యసేవల గురించి, ఆహారం కోసం పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. తాము భోజనం కోసం దూరంగా ఉన్న హోటళ్ళ వద్దకు వెళ్ళి తెచ్చుకుంటున్నామని, రోజుకు 300 రూపాయల వరకు ఖర్చవుతుందని మంత్రికి వివరించారు

### శంషాబాద్ మాజీ పంచాయతీ అధికారి దుబ్బుడు సురేందర్ రెడ్డిని అరెస్ట్ చేసిన అవినీతి నిరోధకశాఖ

**రంగారెడ్డి, మే 12 (అక్షర వెలుగు):** శంషాబాద్ మాజీ పంచాయతీ అధికారి దుబ్బుడు సురేందర్ రెడ్డిని అవినీతి నిరోధకశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించిన అధికారులు సురేందర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నారు. కాగా సురేందర్ రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు సురేందర్ రెడ్డికి సంబంధించిన నివాసంలో సోదాలు నిర్వహించారు. సురేందర్ రెడ్డి నివాసంలో భారీగా ఆస్తులు, నగలను అధికారులు గుర్తించారు. ఇంట్లో 60 తులాల బంగారం, బ్యాంక్ లాకర్స్‌లో 129.2 తులాల బంగారం, నాలుగు ఓపెన్ ప్లాట్స్, 4 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ. 2,31,63,600 అక్రమ ఆస్తులు గుర్తించిన ఏసీబీ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. సురేందర్ రెడ్డి అదుపులోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

## దుబాయ్ పర్యటనలో విషాదం

గుండెపోటుతో శివసేన ఎమ్మెల్యే మృతి

**ముంబై, మే 12 (అక్షర వెలుగు):** కుటుంబంతో సరదాగా విహారయాత్రకు వెళ్లిన ఓ ఎమ్మెల్యే.. దుబాయ్‌లో హఠాన్మరణం చెందారు. గుండెపోటుతో అక్కడే ఆయన కన్నుమూశారు. మృతి చెందిన ఎమ్మెల్యేను మహారాష్ట్ర శివసేన ఎమ్మెల్యే రమేష్ లట్కే(52) గా గుర్తించారు. బుధవారం అర్ధరాత్రి శివసేన ఎమ్మెల్యే రమేష్ లట్కే దుబాయ్‌లో కన్నుమూశారు. ఆయన విడిది చేసిన చోటే తీవ్ర గుండెపోటుకు గురై ఆయన కన్నుమూసినట్లు తెలుస్తోంది. ఆయన మరణాన్ని శివ సేన వర్గాలు ధృవీకరించాయి. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపాయి. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే హఠాన్మరణంతో మహా రాజకీయ వర్గాల్లో విషాదం నెలకొంది. పార్టీలకతీతంగా నివాళులు అర్పిస్తున్నారు నేతలు.

## అమిత్ షా పర్యటన ఖరారు

14న మధ్యాహ్నం రానున్న హోంమంత్రి

**హైదరాబాద్, మే 12 (అక్షర వెలుగు):** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటన అధికారికంగా ఖారరయ్యింది. ఆయన ఒకరోజు పర్యటనకు శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ సంగ్రామయాత్ర ముగింపు సందర్భంగా శివారులోని తుక్కుగూడ సభలో పాల్గొంటారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు అమిత్ షా చేరుకుంటారు. అక్కడి నుంచి రామంతాపూర్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్

2వ

## తమిళాన్ని మద్రాస్ హైకోర్టులో అధికార భాషగా ప్రకటించాలి

- హిందీకి ఇచ్చనట్లుగానే తమిళానికి అవకాశం కల్పించాలి
- ప్రధాని మోడీ, చీఫ్ జస్టిస్ రమణలకు సిఎం స్టాలిన్ లేఖలు



**చెన్నై, మే 12 (అక్షర వెలుగు):** తమిళాన్ని మద్రాస్ హైకోర్టులో అధికార భాషగా ప్రకటించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు లేఖలు రాశారు. రాజస్థాన్, బిహార్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ హైకోర్టులలో ఇంగ్లిష్‌తోపాటు హిందీకి అధికార భాష హోదాను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంగ్లిష్‌తోపాటు రాష్ట్రాల్లో అధికార భాషను సంబంధిత హైకోర్టు అధికార భాషగా ప్రకటించడానికి ఉన్న అడ్డంకులేమిటని

2వ

# సంపాదకీయం

## రాజకీయ వేడి సృష్టిస్తున్న నేతలు !

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి అందుకుంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా రాజకీయ పార్టీల ఫోకస్ మాత్రం రాజకీయాలు..ఎన్నికలపైనే ఉంది. ప్రజల సమస్యలపై పెద్దగా పట్టింపు లేకుండా పార్టీల నేతలు సాగుతున్నారు. సమస్యలు ప్రస్తావిస్తున్నా ప్రభుత్వాలను నిలదీసేస్థాయిలో పోరాటాలు ఉండడం లేదు. అధికార వైసిపి, టిఆర్ఎస్‌లు కూడా కక్షసాధింపు రాజకీయాలతో ఆందోళనలు అడ్డుకోవడం,అణచి వేయడం, అరెస్టులు చేయడం వంటి చర్యలను అవలంబిస్తున్నాయి. ఎపిలో ఇప్పుడు పరీక్ష పేపర్ల లీకేజ్, నారాయణ అరెస్ట్,జనసేన, బిజెపి పొత్తు రాజకీయాలు నడుస్తున్నాయి. అధికార వైసిపి వీటిని ఎదుర్కొం టూనే ప్రజల్లోకి వెళుతోంది.మొత్తంగగా ఎపిలో వైసిపి వరస్సెస్ టిడిపి,జనసేన, బిజెపిగా సాగుతోంది. కాంగ్రెస్ పెద్దా అక్కడ ప్రభావం చూపడం లేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు శైలజానాథ్‌కు ప్రజల్లోకి వెళ్లేంత సత్తా లేదనే చెప్పాలి. అలాగే కాంగ్రెస్ కూడా పెద్దగా ప్రభావంచూపేలా కార్యక్రమాలు చేయడం లేదు. ఇక తెలంగాణలో రాజకీయం మరింత వేడెక్కింది. బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర 14న ముగియనుంది. అమిత్ షా ముగింపు సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. టిఆర్ఎస్ కూడా దీటుగా జిల్లాల్లో పర్యటిస్తోంది. మంత్రులు జోరుగా పర్యటిస్తూ అధికారిక కార్యక్రమాలతో కాంగ్రెస్,బిజెపిలను ఎండగడుతున్నారు. ఇకపోతే రాహుల్ గాంధీ రెండు రోజుల తెలంగాణ పర్యటన కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపింది. వరంగల్ సభ సక్సెస్ పట్ల ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాహుల్ తన పర్యటన రెండవ రోజు హైదరాబాద్‌లో పలు సమావేశాలు నిర్వహించారు. ముందుగా చెంచల్‌గూడ జైలుకు వెళ్లి ఎన్ఎస్‌యూఐ విద్యార్థులను పరామర్శించారు. తరువాత గాంధీ భవన్ లో వివిధ విభాగాలకు చెందిన పార్టీ నేతలను కలిశారు. తాజ్ కృష్ణా హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారులతో కూడా సమావేశమయ్యారు. వారితో పాటు తెలంగాణ మేధావులు, జర్నలిస్టులను కూడా ఆయన మాటామంతీ జరిపారు. ప్రజాగాయ కుడు గద్దర్‌తో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన కళాకారులు, రచయితలు, విద్యారంగ ప్రముఖులను కూడా రాహుల్ కలిశారు. రాహుల్‌ను కలిసిన వారిలో ఎక్కువ మంది సీఎం కేసీఆర్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తోన్న వారే కావటం గమనార్హం. ఒాహుల్ గాంధీ పర్యటనలో ప్రధానమైనది వరంగల్‌లో జరిగిన రైతు సంఘర్షణ సభ. ఈ సభ ద్వారా తెలంగాణ కాంగ్రెస్ ప్రజలకు ఏం చెప్పాలను కున్నారో రాహుల్ గాంధీ చాలా విస్పష్టంగా వివరించారు. సూటిగా ..సుత్తి లేకుండా విషయం చెప్పారు. వరంగల్ సభ ద్వారా కాంగ్రెస్ పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు గంట మోగించినట్టుగా ఉంది. పేరుకు వరంగల్ డిక్లేరేషన్ కావచ్చు..కానీ దానిని పరిశీలిస్తే అది వచ్చేఅసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ మేనిఫెస్టోగా కనిపిస్తుంది. కేసీఆర్ సర్కార్ పాలనాపరమైన, విధాన పరమైన వైఫల్యాల నుంచి, విపక్షాల విమర్శల నుంచి కాంగ్రెస్ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే ప్రయత్నం చేసింది. టీఆర్ఎస్‌కు ప్రత్నామ్నాయం గా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ప్రభుత్వాన్ని విమర్శించటం, అధికారంలో ఉన్నవారిని అదే పనిగా దూషించటం ఇప్పుడు బహిరంగ సభలలో చాలా సాధారణం. కానీ వరంగల్ సభలో అలాంటివేమీ లేవు. కేసీఆర్ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిన హామీలను తాము పూర్తి చేస్తామని తెలంగాణ ప్రజలకు ఈ సభ ద్వారా రాహుల్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ సరిగా అమలు చేయలేదనే విమర్శలు ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. టీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల పోడు భూముల సమస్యను పరిష్కరించలేకపోయింది. తాను దగ్గరుండి ఈ పంచాయితీని తేలుస్తానని కేసీఆర్ అనేక మార్లు చెప్పారు. కాని అదేదీ జరగలేదు కాబట్టి కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే తక్షణం పోడు భూముల సమస్య పరిష్కరిస్తుందని హామీ ఇచ్చింది. అలాగే గిరిజన రిజర్వేషన్ల పెంపు అంశం. గిరిజన జనాభాకు అనుగుణంగా వారికి పది శాతం రిజర్వేషన్లు ఉండాలని తెలంగాణ అసెంబ్లీ గతంలో తీర్మానం చేసి పంపింది. కానీ అది వాస్తవ రూపం దాల్చేలా చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయి. అందుకే కాంగ్రెస్ వ్యూహాత్మకంగా రిజర్వేషన్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వస్తే పదిశాతం గిరిజన రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పింది. అంతేకాదు, గిరిజన సమస్యలను మరింత బలంగా హైలైట్ చేసేందుకు త్వరలో ఇలాంటిదే మరో సభ పెడతానని చెప్పటం గమనార్హం. అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. రాహుల్, నడ్డా సభలను ఏకిపారేస్తూ కెటిఆర్, హరీష్ రావులు చురుకుగా సభలుపెడుతున్నారు. ఈ రెండు పార్టీలే తమ లక్ష్యంగా వారు విమర్శల దాడి పెంచారు. ప్రస్తుతం కేసీఆర్ సర్కార్ అమలు చేస్తున్న రైతుబంధు కౌలు రైతులకు వర్తించుట లేదు. దీనిపై అనేక విమర్శలు కూడా ఉన్నాయి. తెలంగాణలో కౌలు విధానం పెరిగింది. అందువల్ల కౌలురైతులకు కూడా ఎకరాకు పదిహేను వేల రూపాయలు ఇస్తామని ప్రకటించింది. కేసీఆర్ ప్రభుత్వంపై ఉన్న విమర్శలు, ప్రజలలో అసంతృప్తి నెలకొని ఉన్న వివిధ అంశాల ఆధారంగా కాంగ్రెస్,బిజెపిలు ఎదురుదాడి చేస్తున్నాయి. వైసిపికి దీటుగా టిడిపికూడా ఎపిలో దాడి మొదలు పెట్టింది. ఎపిలో తమపొత్తు జనసేన తోనే అని బిజెపి స్పష్టం చేసింది. టిడిపి కూడా జనసేనతో పొత్తుకు తహతహలాడుతోంది.కార్పొరేటర్ కూడా లేని రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని... ఏపీలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ దగ్గర నవరత్నాల కంటే ఎక్కువ రత్నాలు ఉన్నాయన్నారు. బీజేపీ పొత్తు జనసేనతోనే అంటూ మరోసారి తేల్చిచెప్పారు. మొత్తంగా ఎపిలో ఇప్పుడు పొత్తుల రాజకీయంపై చర్చ నడుస్తోంది. ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం ఉన్నా రాజకీయ వేడి పుట్టింది. మొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంపై ప్రజలు కూడా చర్చిస్తున్నారు. మంచీ చెడులను విశ్లేషిస్తున్నారు. ఈ సారి ఎన్నికలు ఎప్పుడు జరిగినా గతంలో లాగా అంత ఈజీగా ప్రజలను బుట్టలో వేసుకోవడం కుదరకపోవచ్చు. ఎందుకంటే ఎన్నికల నాటికి మరింత జోరుగా చర్చ సాగనుంది. సామయాజిక మాధ్యమాల్లో కూడా విశ్లేషణలు ప్రభావితం చేయనున్నాయి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# టిఆర్ఎస్ విమర్శలకు ధీటుగా సమాధానం

### ఎప్పటికప్పుడు తిప్పికొట్టే యత్నంలో రేవంత్ ● విమర్శలకు ప్రతి విమర్శలతో ప్రజల్లో ఫాలోయింగ్



**హైదరాబాద్, మే 12 (అక్షర వెలుగు):** టిఆర్ఎస్ విమర్శలకు పిసిసి చీఫ్ రేవంత్ దూకుడుగానే సమాధానం ఇస్తున్నారు. నీ లెక్కెంత అన్న రీతిలో ఎదురుదాడి చేస్తున్నారు. కెటిఆర్,హరీష్ రావు విమర్శలకు ప్రతివిమర్శలు చేస్తున్నారు. రాహుల్ పర్యటన తరవాత పార్టీలో విభేదాలు సమిసి పోకున్నా కొంతకాలం పిసిసి చీఫ్ రేవంత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే వారు కొంతకాలం ఓపిక పట్టవచ్చు. ఇప్పటికే ప్రజల్లోకి వెళతామని సీనియర్ నేత విహెచ్ ప్రకటించారు. మరో సభ కూడా ఉంటుందని పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ వెల్లడించారు. మరోవైపు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ సభపై చేసిన విమర్శలకు కూడారేవంత్ ఘాటుగానే స్పందించారు. రాజకీయ పర్యాటకులు వస్తారు..వెళతారు. తెలంగాణలో కేసీఆర్ మాత్రమే ఎప్పటికీ ఉంటారు అంటూ ట్వీట్ చేశారు. దేశంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొనే వారు ఎవరైనా ఉన్నారా? పొత్తు కావాలని కాంగ్రెస్‌ను ఎవరైనా అడిగారా? కాలం చెల్లిన కాంగ్రెస్‌తో పొత్తుకు ఎవరూ సిద్ధంగా లేరని కౌంటర్ ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల గురించి పార్లమెంటులో రాహుల్ ఏనాడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలను ఎవరూ నమ్మవద్దని కేటీఆర్ తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన టూరిస్టు వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఘాటుఆనే స్పందించారు. కేటీఆర్ గారూమీ దృష్టిలో తెలంగాణ ఒక టూరిస్ట్ ప్లేస్ అయి ఉండొచ్చు! కాంగ్రెస్ దృష్టిలో ఈ రాష్ట్రం అమరవీరుల త్యాగఫలం. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల ప్రతిరూపం. మీ వక్రదృష్టి ప్రకారం ఇది టూరిస్ట్ ప్లేస్ అనుకున్నా దానిని సృష్టించింది కూడా కాంగ్రెసే అని ట్వీటర్ వేదిక కౌంటర్ ఇచ్చారు. మొత్తం మీద వరంగల్ సభ ద్వారా తెలంగాణ రాజకీయాలు టీర్ఎస్, కాంగ్రెస్ చుట్టూ తిరుగుతాయనటంలో సందేహం లేదు. అన్నింటికి మించి కాంగ్రెస్ పార్టీ చాలా నిర్దిష్టంగా వరంగల్ డిక్లేరేషన్‌కు రూపకల్పన చేసిందని అర్థమవుతోంది. వరికి కనీస మద్దతు ధర రూ. 2500 ఇస్తాననటంతో పాటు పత్తి, మిర్చి, పసుపు వంటి పంటలకు కూడా మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పటం అందులో భాగమే. వీటితో పాటు ఇంకా అనేక అంశాలపై పార్టీ వైకరిని రాహుల్ గాంధీ సూటిగా చెప్పారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసి దోచుకున్న టీఆర్ఎస్‌తో ఎన్నికల పొత్తు ఉండదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్, టిఆర్ఎస్ మధ్య నేరుగా పోరు ఉంటుందని, టీఆర్ఎస్‌ను ఓడించి తీరుతామన్నారు. టీఆర్ఎస్‌కు తామే ప్రధాన ప్రత్యర్థినని బీజేపీ చెప్పుకుంటున్న సమయంలో అధికార పార్టీకి తన పార్టీని ఏకైక ప్రత్యామ్నాయంగా ఉంచడానికి రాహుల్ వరంగల్ సభ ద్వారా ప్రయత్నించారు. టీఆర్ఎస్‌తో పొత్తు అంశాన్ని పరోక్షంగా లేవనెత్తినా కూడా పార్టీ నుంచి బయటకు పంపించేస్తామన్నారు. ఎంత పెద్ద కాంగ్రెస్ నేతలైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు సంబంధించిన ఇటీవలి పరిణామాల నేపథ్యంలో టీఆర్ఎస్‌తో పొత్తుపై రాహుల్ చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. పీకే ఓ వైపు కాంగ్రెస్‌లో చేరుతూనే .. మరోవైపు టీఆర్ఎస్‌తో వ్యాపార బంధం కొనసాగిస్తారని వచ్చిన వార్తా కథనాలను బీజేపీ తనకు అనుకూలంగా ఉపయోగించుకుంది. టీఆర్ఎస్ కాంగ్రెస్ రెండూ ఒకటే అన్నట్టు మాట్లాడింది. అందుకే ఆయన వ్యూహాత్మకంగా వరంగల్ సభలో బీజేపీపై తీవ్రస్థాయి విమర్శలకు వెళ్లలేదని చెప్పవచ్చు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తిగా వారి పనితీరు పైనే ఆధారపడా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించటం పార్టీ కోసం నిజంగా కష్టపడి పనిచేసే వారిలో ఉత్సాహం నింపుతుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు.. ప్రజల పక్షాన నిలబడి వారి ప్రయోజనాల కోసం పోరాడే నాయకులకే టిక్కెట్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పటం అరుదైన విషయం. ఎప్పుడు కావాలంటే అప్పుడు పార్టీ చేపట్టే ఆందోళనలకు అందుబాటులో ఉంటానని ప్రకటించడం ద్వారా తెలంగాణపై ఆయన పూర్తిగా దృష్టి సారించారని అర్థమవుతోంది.

## అమిత్ షా పర్యటన ఖరారు

(మొదటి పేజి తరువాయి) ల్యాబరేటరీని సందర్శించనున్నారు. తుక్కుగూడలో రెండోవిడత ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభను నిర్వహించనున్నారు. సాయత్రం 6 గంటలకు ప్రజాసంగ్రామ యాత్ర ముగింపు సభలో అమిత్‌షా పాల్గొననున్నారు. అదేరోజు రాత్రి 8.20 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు.

## అట్టడుగు వర్గాలకు చేయూత ముఖ్యం

(మొదటి పేజి తరువాయి) ప్రత్యామ్నాయం రావాలి. అది ప్రత్యామ్నాయ రాజకీయ విధానాల ద్వారానే సాధ్యం.దళితులపై నేరాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఏడవ స్థానంలో, ఆరోగ్య ఇండెక్స్‌లో ఎనిమిదో స్థానంలో, మహిళలపై నేరాల్లో దేశంలో తొమ్మిదో స్థానంలోనూ వుండగా, ప్రాథమిక విద్యలో పదిహేడవ ర్యాంకులో వుంది. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. గుంటూరు జిల్లాలో నేరాలు పెరుగుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్ట ఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం. అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయి ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తోపాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు,

## రోగుల అటెండర్లకు మూడుపూటల భోజనం



(మొదటి పేజి తరువాయి) కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రతి భోజనం మీద రూ. 21 చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమానికి రూ. 40 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశాం. ఒక వేళ ఖర్చు పెరిగినా కూడా ప్రభుత్వం భోజనం పెట్టేందుకు వెనుకాడదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతున్న ఉస్మానియా ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశామని మంత్రి తెలిపారు. ఉస్మానియా మార్చురీ ఆధునీకరణ కోసం రూ. 6 కోట్లను మంజూరు చేశామన్నారు. దీనికి సంబంధించిన పనులు కూడా ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఆధునీక మార్చురీగా తయారు చేస్తామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో కొత్తగా 75 ఐసీయూ పడకలు మంజూరు చేశామని, అందులో 40 ఐసీయూ పడకలను ప్రారంభించా మన్నారు. ఈ పడకలను జనరల్ మెడిసిన్, అనస్థీషియా విభాగాల్లో ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బెడ్‌కు వెంటిలేటర్, మానిటర్ ఏర్పాటు చేశాం. ఇదే ఐసీయూ బెడ్లకు ప్రయివేటులో అయితే రూ. 15 వేల నుంచి రూ. 30 వేల వరకు ఛార్జీ వేస్తారు.. కానీ ఉస్మానియాలో మాత్రం ఉచితంగా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. మరో 30 పడకలకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల్లోనే ప్రారంభిస్తామన్నారు. వీటితో పాటు మరో రూ. 36 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశామన్నారు. ఆర్థోపెడిక్ విభాగాన్ని రూ. 2 కోట్ల 63 లక్షలతో ప్రారంభించామన్నారు. రూ. 70 లక్షలతో పూర్తి చేసిన మైనర్ ఆపరేషన్ థియేటర్‌ను పూర్తి చేసి ప్రారంభించామని చెప్పారు. రూ. మూడున్నర కోట్లతో ఐసీయూ బెడ్స్ ప్రారంభించాం. ఓపీ రిజిస్ట్రేషన్, ఫార్మసీ బ్లాక్‌ను కూడా ప్రారంభించామన్నారు. హెచ్ఎండీఏ సహకారంతో గేటు, పరిసరాలను తీర్చిదిద్దడానికి రూ. 50 లక్షలతో శంకుస్థాపన చేశాం. రెండు నెలల్లో పూర్తవుతుందని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పురుగులు పట్టిన రేషన్ బియ్యాన్ని లబ్దిదారులకు ఇచ్చేవారని, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్న బియ్యం అందిస్తున్నామని అన్నారు. తెలంగాణలో మాత్రమే బీసీ, ఎస్సీ హాస్టల్స్ లలో సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నామన్నారు. వృద్దులకు రూ.2016పెన్షన్ ఇస్తున్నామన్నారు. పెళ్లి సమయంలో ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు తీసుకొచ్చామన్నారు. ఆస్పత్రుల్లో పేషెంట్లకు డైట్ చార్జ్ కూడా పెంచామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేషెంట్ సహాయకులకు టిఫిన్, లంచ్, డిన్నర్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రోగులు, వారి సహాయకులు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారని, వీరంతా కేవలం రూ.5కే భోజనం చేయవచ్చున్నారు.

## రాజ్యసభ ఎన్నికలకు మోగిన నగారా

(మొదటి పేజి తరువాయి) నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, జూన్ 3న నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీగా నిర్ణయించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

## కల్పనలో హైదరాబాద్ మిన్న

(మొదటి పేజి తరువాయి) ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ఆపిల్, గూగుల్, ఉబర్, నోవార్టిస్ వంటి సంస్థలు నగరానికి వచ్చాయని చెప్పారు. ఆయా సంస్థల రెండో పెద్ద క్యాంపస్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే అమెజాన్ అతిపెద్ద సెంటర్ నగరంలో ఉన్నదని చెప్పారు. కాల్‌అవే కూడా



మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరుకుంటున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. కాల్‌అవే గోల్ఫ్ సంస్థ హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో అతిపెద్ద డిజిటెక్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నది. దీనిద్వారా సుమారు 300 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. కాల్ అవే గోల్ఫ్ సంస్థ రెండో కార్యాలయం కోసం.. తెలంగాణను ఎంచుకోవడం చాలా సంతోషమన్నారు. మౌళిక సదుపాయాల్లో దేశంలోని అన్ని నగరాల కంటే.. హైదరాబాద్ ముందుందని కేటీఆర్ పేర్కొన్నారు. అమెరికా తర్వాత చాలా చర్చల అనంతరం ఇండియాలో కార్యాలయం పెట్టాలనుకున్నామని కాల్ అవే సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సాయి కూరపాటి తెలిపారు. హైదరాబాద్‌లో మంచి సౌకర్యాలున్నాయని తెలుసుకుని ఇక్కడే ఈ కంపెనీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. ఇక్కడి సదుపాయాలు చూసిన తర్వాత భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టే సూచన కనిపిస్తోందని అన్నారు.కార్యక్రమంలో ఐటి సెక్రటరీ జయేశ్రంజన్, కాల్ అవే సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నర్సుల సేవలు వెలకట్టలేనివి

(మొదటి పేజి తరువాయి) విపరీతమైన గౌరవాన్ని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వారి ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తుంది. కాలిన గాయాలతో దవాఖానలకు వచ్చే బాధితులైనా.. రోడ్డు ప్రమాద క్షత గాత్రులైనా.. పురిటినొప్పులతో వచ్చే గర్భిణులైనా.. మరింకెవరైనా తోబుట్టువుల్లా మొదట పలుకరించేది వాళ్లే. అలాంటి సిస్టర్స్‌కు ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా సమాజం సెల్యూట్ చేస్తున్నది.అంతర్జాతీయ నర్సుల దినోత్సవం మే 12న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఎ÷-లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా ఈ



అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రజల ఆరోగ్యరక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ దినోత్సవంనాడు గుర్తుచేసుకుంటారు. ఎ÷-లోరెన్స్ నైటింగేల్ 1820, మే 12న ఇటలీలో జన్మించింది. 1853న లండన్ లోని ఓ స్త్రీల ఆస్పత్రిలో సూపరిండెంట్‌గా చేరిన నైటింగేల్, 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయడానికి నర్సుల బృందాన్ని తీసుకొని వెళ్లింది. 1859లో 'నోట్స్ ఆన్ నర్సింగ్' అనే పుస్తకాన్ని ప్రచురించిన నైటింగేల్, ప్రపంచంలోనే మొదటి నర్సుల శిక్షణ కాలేజీని కూడా స్థాపించింది. నైటింగేల్ సేవలను గుర్తించిన 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుండి నైటింగేల్ పుట్టినరోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించారు.

## తమిళాన్ని మద్రాస్ హైకోర్టులో అధికార భాషగా ప్రకటించాలి

(మొదటి పేజి తరువాయి) ఆశ్చర్యం వ్యక్తమవుతోందని చెప్పారు. న్యాయ వ్యవస్థలో సంస్కరణలు జరగాలని చెప్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాల్లో వైవిధ్యం చాలా ముఖ్యమని తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి గమనిస్తున్నదాని ప్రకారం, ఉన్నత న్యాయ వ్యవస్థలో అన్ని వర్గాలవారి ప్రాతినిధ్యం తగ్గుతోందన్నారు. ఇది వైవిధ్యం లోటుకు దారి తీస్తోందన్నారు. న్యాయ వ్యవస్థలో వైవిధ్యం ప్రామాణిక, నాణ్యమైన న్యాయ నిర్ణయానికి ప్రాథమికమైనదని చెప్పారు. వేర్వేరు నేపథ్యాలుగల న్యాయమూర్తులు యావత్తు సమాజానికి ప్రాతినిధ్యం వహించే విస్తృత స్థాయి, వైవిధ్యభరితమైన వర్గాలకు చెందిన న్యాయమూర్తులు ఉండాలన్నారు. ముఖ్యంగా చారిత్రక, సంప్రదాయ, భాషాపరమైన, సాంస్కృతికపరమైన అంశాల్లో ఈ వైవిధ్యం అవసరమని చెప్పారు. వేర్వేరు నేపథ్యాలుగల న్యాయమూర్తులు తమ నేపథ్యాల ఆధారంగా చట్టాలను సహజంగా వివరించి, అమలు చేస్తారని, విస్తృత దృక్పథాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రాంతీయ ధర్మాసనాలు,సుప్రీంకోర్టు ప్రాంతీయ ధర్మాసనాలను శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలని కోరారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలందరికీ అత్యున్నత న్యాయస్థానం అందుబాటులో ఉండాలని భారత రాజ్యాంగంలోని అధికరణ 32 చెప్తోందన్నారు. ఆర్థిక పరిమితుల కారణంగా ఈ హక్కు క్రమంగా బలహీనపడుతోందని చెప్పారు. భౌగోళికంగా ఢిల్లీకి దూరంగా ఉన్న రాష్ట్రాలవారు సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఇటువంటి రాష్ట్రాల్లోని చాలా మంది సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కును కోల్పోతున్నారన్నారు. న్యాయ ప్రక్రియ గురించి సామాన్య ప్రజలు అర్థం చేసుకోవడానికి వీలుగా దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో స్థానిక భాషను ఉపయోగించవలసిన అవసరం ఉందన్న ప్రధాని మోడీ వ్యాఖ్యలను గుర్తు చేశారు. స్థానిక భాషలను కోర్టుల్లో ఉపయోగిస్తే న్యాయ వ్యవస్థపై సామాన్యులకు నమ్మకం పెరుగుతుందని, న్యాయ వ్యవస్థతో తమకు అనుబంధం ఉందని భావిస్తారని చెప్పారు.

## వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలి

### ఆప్ చైర్‌పర్సన్ ఇందిరా శోభన్ డిమాండ్




**న్యూఢిల్లీ, మే 9 (అక్షర వెలుగు):** రైతు నుంచి వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత ఇందిరాశోభన్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బయటకు ఒకటి చెబుతూ ఆచరణలో మరొకటి అమలు చేస్తోందని ఆమె విమర్శించారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. వడ్ల కొనుగోళ్లను ఆలస్యం చేస్తూ రైతులు మిల్లర్లకు అమ్ముకునేలా ప్లాన్ చేశారని అన్నారు. అందులో భాగంగానే కొనుగోలు సెంటర్ల ఏర్పాటులో లేట్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు 30 శాతం కొనుగోలు సెంటర్లనే ఓపెన్ చేయడం సర్కార్ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటి వరకు కొన్నది 17 శాతం మాత్రమే. ప్రస్తుతం 40 లక్షల టన్నుల వడ్లు అమ్మేందుకు రైతుల దగ్గర రెడీగా ఉన్నా.. ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 6857 సెంటర్లను తెరుసతాము అని చెప్పి 5774 కొనుగోలు సెంటర్లను మాత్రమే ప్రారంభించి రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు ఓపెన్ చేసిన సెంటర్లు కేవలం 3760 మాత్రమేనని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను వారం రోజుల క్రితమే వడ్లను మార్కెట్లో పోసినప్పటికి కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతుందని, ఇప్పటికైనా సర్కార్ మేల్కోవాలని అన్నారు. వర్షం వస్తే కప్పడానికి టారపాలిండ్లు లేవు,తడిస్తే ఆర బెట్టడానికి సెంటర్ లో ఏర్పాట్లు లేవు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, అన్ని కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించి వడ్లు పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని ఇందిరాశోభన్ డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలు లో ఇబ్బంది లేదు అని గంగుల కమలాకర అని చెబుతున్నారు మరి సిరిసిల్ల జిల్లా కోనరావు పేటలో,ఖమ్మం జిల్లా అనాసాగరం సెంటర్ దగ్గర ఎందుకు వడ్లు కొనుగోలు చేయాలని ధర్నా చేశారు మంత్రి. అబద్ధాలతో ఇంకా ఎన్ని రోజులు ప్రజలను మోసం చేస్తారు. మిల్లర్లు చేసే మోసం ను ఎందుకు అరికట్ట లేకపోతున్నరు.వర్షాల కు, గాలి దుమారంకు భయపడి అడ్డికి పావు షేర్ లాగా రైతులు ప్రైవేట్ మార్కెట్లో అమ్ముతున్నారు. రైతుల తో రాజకీయాలు మాని త్వరగా కల్లాల్లోని ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలని ఆప్ చైర్‌పర్సన్ ఇందిరా శోభన్ డిమాండ్ చేశారు.

## పల్లె ప్రకృతి వనంలో పోషక ఉద్యానవనం



(మొదటి పేజి తరువాయి) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించా మన్నారు. ఇక్కడ పండిచిన కూరగాయలను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారని మంత్రి తెలిపారు. ఇందులో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ అంగన్‌వాడీల ద్వారా అందజేస్తామన్నారు. అంతకుముందు పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీడీఓ, ఎంపీవో, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జాజుల శ్రీనివాస్ గౌడ్ దంపతుల వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బీసీ యువజన సంఘ రాష్ట్ర కమిటీ



**మునుగోడు, మే 13(అక్షర వెలుగు):** తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ దంపతుల వివాహ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాదులో తన నివాసంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆన గంటి కృష్ణ రజక కలిసి దంపతులకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధి హామీ పని రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలి

### జిల్లా ఉపాధ్యక్షుడు కె మహేష్ రెడ్డి



**మెదక్, మే 12 (అక్షర వెలుగు):** ఉపాధి హామి పథకంలో రెండు పూటల పని రద్దు చేయాలని మండుటెండలో పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.మహేష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు పట్టెడు అన్నం దొరికే ఈ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని అడిగిన వారందరికీ పని కల్పించాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో మెడికల్ కిట్లు ఉంచాలని డిమాండ్ చేశారు.టెంట్లు, పనిమెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. గాయపడిన వారికి గాయం తగ్గేవరకు అటెండెన్స్ వేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించిందని ఇకనుండి కూలీలు రెండు పూటలా పనిచేయాలని, 20 మంది గ్రూపు విధానాన్ని కొనసాగించాలి. కొలతలు చేసేటప్పుడు టెక్నికల్ అసిస్టెంట్లుతో ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని అని కొత్త కొత్త నిబంధనలు పెట్టి ఈ పనులు ఒత్తిడితో కూలీలను గందరగోళ పరిచే ప్రభుత్వ విధానాలను ఆపాలని డిమాండ్ చేశారు. ఆధునిక యంత్రాలు వచ్చి ఎక్కడ పనులు దొరకడం లేదన్నారు. అనేకచోట్ల ఉపాధి లేక పేదలు పొట్ట చేత పట్టుకొని వలసలు వెళుతున్నారు. ఈ సమయంలో ఉపాధి పనులే కూలీలకు అండ అన్నారు. వెంటనే అధికారులు కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్యాలయల ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# పదో తరగతితోనే ఉన్నత సాంకేతిక విద్య




**మెదక్, మే 12 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లాలో కేవలం పదో తరగతి కాగానే ఉన్నత సాంకేతిక విద్యను అభ్యసించేందుకు పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల అయిందని మంగళవారం మెదక్ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సువర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్నవయసులోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఉన్నత విద్యతోపాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుందని, గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తూప్రాన్ పట్టణంలో కరపత్రాల ఆవిష్కరణ



**మెదక్, మే 12 (అక్షర వెలుగు):** కేంద్ర ప్రభుత్వం 2019 రోడ్డు సేఫ్టీ బిల్లు పేరుతో తెచ్చినటువంటి రవాణా రంగం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని మంగళవారం మెదక్ జిల్లా తూప్రాన్ బస్టాండ్ ఆవరణలో టిఆర్ఎస్కెవి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాల్‌రాజ్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బుధవారం రవాణా రంగం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు రవాణా సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని, అలాగే ఈ నెల 16, 17 వ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగం బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోళ్ళు- మద్దతు ధర

## రైతులకు ఇబ్బంది తలెత్తకుండా దాన్యం కొనుగోళ్లు



**సిద్దిపేట్, మే 12 (అక్షర వెలుగు):** అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి గురువారం జిల్లాలోని సిద్దిపేట, చిన్నకోడూరు మార్కెట్ యార్డులు మరియు చిన్నకోడూర్ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ళను పర్యవేక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తేమశాతం 17 లోపు ఉన్న ధాన్యాన్ని ఏమాత్రం ఆలస్యం లేకుండా తొందరగా కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని, రైతులు తమ ధాన్యాన్ని కేంద్రంలో గల ప్యాడీ క్లీనర్ వినియోగించుకుని తాలు లేకుండా శుభ్రభపరిచి తేమ శాతం 17 లోపు ఉండేలా చూసి కొనుగోలువేగవంతం కు సహకరించాలని, కేంద్ర నిర్వాహకులు రైతులకు కావలసినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులు తమ వరిధాన్యం వెంటనే ఉండి అకాల వర్షాలకు తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచగలరని కోరారు. కేంద్ర నిర్వాహకులు సంబంధిత అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఏరోజుకారోజు టాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. రైతులకు అందుబాటులో మంచినీరు, నీడ సదుపాయం కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి జె.హరీశ్ మరియు జిల్లా సహకార అధికారి జి. చంద్ర మోహన్ రెడ్డి ఉన్నారు.

# శిథిల స్థితికి చేరుకున్న ఎస్సి కమ్యూనిటీ హాల్ భవనం



**దోమ, మే 12 (అక్షర వెలుగు):** దోమ మండల పరిధిలోని మోత్కూరు గ్రామంలోనీ ఎస్సి కాలనీలో ఉండే ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం శిథిల స్థితికి చేరుకుంది. భవనం లోపలి పగుళ్లు ఏర్పడి వర్షం వస్తే నీళ్లు లోపలికి వస్తున్నాయని కాలనీ వాసులు తెలిపారు. భవనంలో ఏదైనా సమావేశాలు ఏర్పాటు చేయాలన్న ఎప్పుడు కులుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షం పడ్డప్పుడల్ల పెక్కులు ఊడి భవనం పూర్తిగా దెబ్బతింటుంది. అని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైన ప్రమాదం జరగక ముందే కమ్యూనిటీ హాల్ భవనం మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ఆటోడ్రైవర్లకు ఐడి కార్డులు పంపిణీ

### టేక్మాల్ ఎస్ఐ లింగం



**మెదక్, మే 12 (అక్షర వెలుగు):** ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ఎస్ఐ బి. లింగం ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ పరిమితిని మించిన వేగంగా వెళ్ళకూడదని, ప్రతి ఆటోకు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్ సి, కలిగి ఉండాలని డ్రైవర్లకు సూచించారు.18 సంవత్సరాలకు పైబడినవారే డ్రైవింగ్ చేయాలి, లేనిచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డ్రైవర్లకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## పరీక్షల్లో ఫైలైతాననే భయంతో విద్యార్థి బలాన్మరణం



**మెదక్, మే 12 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం భైరందిబ్బ గ్రామానికి చెందిన చేవాలా మల్లేశం ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఇంటర్ పరిక్ష రాసిన విద్యార్థి ఫైలైపోతాననే భయంతో ఉరేసుకున్నడని విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే రాత్రి ఇంట్లో దూలనికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని, పరీక్షలు తప్పుతాను అనే భయంతో చనిపోయాడని తండ్రి మల్లయ్య పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమం



**మెదక్, మే 12 (అక్షర వెలుగు):** ఈ వర్షాకాలం సన్నదత లో బాగంగా వ్యవసాయ మరియు పోలీస్ శాఖ అద్వర్యం లో రామాయంపేట వ్యవసాయ డివిజన్ పరిధి లో గల రామాయంపేట నిజాంపేట్ నార్సింగి చేగుంట డీల ర్లు తో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ విత్తనాలు అమ్మే ప్రతి షాపు నందు విత్తన లైసెన్స్ కనబడే విధంగా ప్రదర్శించాలని స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు సరిచేయాలని, విత్తనం కొన్న ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, కాలం చెల్లిన వితనాలను ఎట్టి పరిస్థితిలో అమ్మ కూడదని , ఎచ్టి కాటన్ విత్తనాలను ఎట్టిపరిస్థితుల్లో అమ్మ కూడదని, గ్లైఫో సెట్ కలుపు మందులు ఆగస్ట్ నెల వరకు అమ్మకూడదని. విత్తన చట్టం ప్రకారం అన్ని నియమ నిబంధనలు పాటించాలని, లేనట్లయితే సిడ్ కంట్రోల్ ఆర్డర్ 1983 ప్రకారం చర్యలు తీసుకోబడతాయని, PM KISAN కింద డబ్బులు వస్తున్న రైతులు తప్పనిసరిగా KYC UPDATE చేసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమం లో సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ నిర్మల రాజ్ నారాయణ, మండల రైతు బందు అధ్యక్షులు నర్సారెడ్డి,లింగారెడ్డి నార్సింగి రెడ్డి పల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు శంకర్ గౌడ్ , పరమేష్ సబ్ ఇన్స్పెక్టర్ రామ్ చంద్రం మండల వ్యవసాయ అధికారులు సతీష్,హరి ప్రసాద్ యాదగిరి వ్యవసాయ విస్తరణ అధికారులు డీలర్లు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి పథకాన్ని సద్వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే సీతక్క



**ములుగు, మే 12 (అక్షర వెలుగు):** గోవిందరావుపేట మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో తాసిల్దార్ అల్లంరాజు కుమార్ అధ్యక్షతన 45 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సీతక్క హాజరై మాట్లాడారు ఆడపిల్ల పెండ్లి జరిగిన ప్రతి పేద కుటుంబం ఈ పథకానికి అర్హులే నని అన్నారు తెలియని వారు అడిగి తెలుసుకొని అధికారుల సహాయంతో సకాలంలో కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు అధికారులు కూడా అర్హులైన వారిని పదేపదే తప్పకుండా వారికి తగు సలహాలు సూచనలు ఇస్తూ సహాయసహకారాలు అందించి సకాలంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం వర్తించేలా చూడాలని అన్నారు రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా వర్తించే ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ములుగు జిల్లాలో ఒక తండా లో అగ్ని ప్రమాదం సంఘటనను చూసి చలించి అధికారంలోకి వస్తే పేద ఇంటి ఆడపడుచుల పెండ్లికి ఆర్థిక సహాయం చేస్తానని చెప్పి మరి అధికారంలోకి వచ్చాక వెంటనే కల్యాణ లక్ష్మి పథకం పేరుతో అమలు పరచారని ఆయన అన్నారు జెడ్పిటిసి తుమ్మల హరిబాబు మాట్లాడుతూ దేశంలోనే కల్యాణలక్ష్మి పథకం ఎంతో ప్రశంసలు అందుకుందనీ ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎంపీటీసీలు రెవిన్యూ అధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరు మృతి మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



**దోమ, మే 12 (అక్షర వెలుగు):** కారు ఢీకొని ఒకరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దోమ ఎస్ ఐ విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం దోమ మండలం బాస్పల్లి గ్రామానికి చెందిన మారుతి తండ్రి బీమయ్య వయస్సు 60, మైస నరేష్ తండ్రి వెంకటయ్య వయస్సు 16, మైస శ్రీకాంత్ తండ్రి చిన్న వెంకటయ్య వయస్సు 14 సంవత్సరాలు గల ముగ్గురు గురువారం సాయంత్రం గోదుగోనిపల్లి గ్రామంలో పొలం పనులు ముగించుకొని తిరిగి బాస్పల్లి గ్రామానికి రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న క్రమంలో చౌదరిగుడా మండలం జిల్లేడు గ్రామానికి చెందిన కావాలి వెంకటయ్య టీఎస్ 06 విఎస్ 3610 నంబర్ గల మారుతి స్విఫ్ట్ కారును అతివేగంగా నడుపుతూ సాయంత్రం 7 గంటల సమయంలో రోడ్డుపై నడుస్తున్న వ్యక్తులను ఢీకొట్టడంతో మారుతి(60) అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలియచేశారు.

## మన ఊరు - మన బడి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ములుగు ఎమ్మెల్యే సీతక్క



**ములుగు, మే 12 (అక్షర వెలుగు):** ములుగు మండల కేంద్రంలోని అబ్బాపూర్ గ్రామములోని మండల ప్రజా పరిషత్ పాటశాల లో మన ఊరు– మన బడి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించిన సీతక్క గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల వైపు వెళ్లకుండా చూడచ్చు అని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజల మీద ఉందని సీతక్క గారు అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ ప్రభుత్వఉపాధ్యాయులుతో పాటు స్థానిక సర్పంచ్ గండి కల్పన కుమార్ సహకార సంఘం చైర్మన్ బొక్క సత్తిరెడ్డి వైస్ చైర్మన్ మద్రి రాజు ఆత్మ డైరెక్టర్ ఆకుతోట చంద్రమౌళి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

## మ్యాచింగ్ బోటిక్ దుకాణం ప్రారంభోత్సవం



**సంగారెడ్డి, మే 12 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం జోగిపేటలో పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శింగార్ మ్యాచింగ్ బోటిక్ దుకాణాన్ని ఆందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ తన సతీమణితో కలిసి నూతన దుకాణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి నూతనంగా ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణంలో చీరలు కొనుగోలు చేశారు. అనంతరం శింగార్ మాచింగ్ బొటిక్ దుకాణం ప్రారంభోత్సవ సందర్భంగా యజమాని గాజుల అనిల్ ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఇప్పటివరకు సంగారెడ్డి జిల్లాలో ఎక్కడ కూడా బొటిక్ సెంటర్ లేకపోవడంతో మేము ఈ సెంటర్‌ను ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. మా వద్ద పట్టణ మహిళలతోపాటు చుట్టుపక్కల గ్రామాల మహిళలకు కూడా ప్రతిరోజు ఒక గంట చొప్పున రెండు బ్యాచ్ లుగా కుట్టు మిషన్ శిక్షణ ఉచితంగా ఇవ్వబడుతుందని ఈ సదవకాశాన్ని మహిళలందరూ వినియోగించుకోవాలని కోరారు.

## కిష్టాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మునుగోడు, మే 13(అక్షర వెలుగు):** రైతులు పండించిన పంటకు ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు కోరారు. గురువారం మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుల అనిల్, వార్డ్ నెంబర్లు, గ్రామ పెద్దలు నందిపాటి రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువు వరులను ఆశీర్వదించిన ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క



**ములుగు, మే 12 (అక్షర వెలుగు):** గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలోని గురువారం పి.ఎస్.ఆర్. గార్డెన్స్ యందు చల్వాయి గ్రామానికి చెందిన వల్లభనేని రామకృష్ణ కుమార్తె వివాహము మరియు మొద్దులగూడెం గ్రామానికి చెందిన తుడుం దెబ్బ మహిళా రాష్ట్ర అధ్యక్షులు విజయ కూతురు వివాహానికి ఏఐసీసీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి మరియు ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క విచ్చేసి నూతన వధువరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్ జిల్లా నాయకులు కణతల నాగేందర్ రావు జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పెండెం శ్రీకాంత్ సహకార సంఘ పాలకవర్గ సభ్యులు జెట్టి సోమయ్య మండల సీనియర్ నాయకులు పాలడుగు వెంకటకృష్ణ జిల్లా నాయకులు జంపాల చంద్రశేఖర్ సూదిరెడ్డి జనార్దన్ రెడ్డి మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు ఎండి.ఖుబ్బు తదితర నాయకులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క



**ములుగు, మే 12 (అక్షర వెలుగు):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని పొట్లూరి మధు మరియు వైష్ణవ నారాయణమ్మ గార్లు ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాలను ఏఐసీసీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి మరియు ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క గారు పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్ జిల్లా నాయకులు కణతల నాగేందర్ రావు జంపాల ప్రభాకర్ పెండెం శ్రీకాంత్ కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి పాలడుగు వెంకటకృష్ణ జంపాల చంద్రశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు

# ఎండ వేడిమికి బైక్ దహనం



**సంగారెడ్డి, మే 12 (అక్షర వెలుగు):** గురువారం సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రమైన తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో పార్క్ చేసిన బైక్ ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు మంటలను అదుపు చేశారు. పెద్ద శంకరంపేట మండలం బూజురం పల్లికి చెందిన రాములు బైక్‌గా గుర్తించారు. రాములు సొంత గ్రామం పెద్దశంకరంపేట మండలం బుజరన్ పల్లి కాగా హైదరాబాద్ జీడిమెట్ల లో నివసిస్తు జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ఈయన అమ్మమ్మ ఊరు వట్పల్లి మండలం పోతుల బొగుడ గ్రామంలో రాములు పెదనాన్నకు సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ కొరకు వట్పల్లి తహసీల్దార్ కార్యాలయనికి రాములు వచ్చారు. బైక్ పై వచ్చిన వారు ఆ బైక్‌ని కార్యాలయ ఆవరణలో ఆ బైక్ ను పార్క్ చేశారు. ఎండవేడిమికి ఒక్కసారిగా బైక్ మంటలు చెలరేగడంతో ఆ బైక్ పూర్తిగా దగ్ధమైంది.

# పెరుగుతున్న జనాభాకు

## అనుగుణంగా ఆహారభద్రత

పోషకాహారాలు అందించాల్సిన బాధ్యత పెరిగింది

పంటల ఉత్పాదకతలో నాణ్యమైన విత్తనాలు ముఖ్యం

ఇస్టా సదస్సులో మంత్రినిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, మే 12 (అక్షర వెలుగు):** పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వారికి పోషకాహార భద్రత కల్పించడం పెద్ద సవాలు వంటిదేనని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిఅన్నారు.ప్రపంచ జనాభా ఇప్పటికే 7.6 బిలియన్లకు చేరుకుంది.అది 2050 నాటికి 9.9 బిలియన్లకు చేరుతుందని అంచనా అని ఆయన అన్నారు.జనాభా పెరుగుదల, పట్టణీకరణ, మారుతున్న ఆహార అలవాట్ల కారణంగా ఆహార ధాన్యాల కోసం ప్రపంచ డిమాండ్ పెరుగుతున్నదని చెప్పారు. అందుకే పంటల ఉత్పత్తి, ఉత్పాదకతను మెరుగుపరచడంలో నాణ్యమైన విత్తనానిది కీలక పాత్ర అన్నారు.భారత వ్యవసాయోత్పత్తి ప్రతి సంవత్సరం స్థిరంగా పెరుగుతూ వస్తున్నదని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈజిప్ట్ రాజధాని కైరోలో జరుగుతున్న 33వ ఇస్టా విత్తన కాంగ్రెస్ సదస్సులో ఇస్టా 2022 – 2025 ఎగ్జిగ్యూటివ్ కమిటీ ఎన్నిక సంధర్భంగావ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్టా వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న రైతులకు,ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంలో ప్రముఖ పాత్ర, బాధ్యతను వహిస్తున్నాయని అన్నారు.విత్తన నాణ్యత పరీక్ష వ్యవస్థను అభివృద్ధి చేయడంలో ఇప్పటికీ ప్రారంభ దశలో ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం విత్తన నాణ్యత పరీక్ష వ్యవస్థను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉన్నదని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా విత్తన పరిశ్రమల అభివృద్ధి స్థాయి ఒకేరీతిగా లేదు, ప్రాంతాలు/దేశాల మధ్య గణనీయంగా మారుతున్నాయన్నారు. విత్తన నమూనా,పరీక్ష కోసం ప్రామాణిక విధానాలను అభివృద్ధి చేయడం, ప్రపంచవ్యాప్తంగా ఒకే విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా విత్తన పరీక్షలో ఏకరూపత' అనే లక్ష్యం ద్వారా విత్తన నాణ్యత పరీక్షా వ్యవస్థలపరంగా అన్ని ప్రాంతాలను సమం చేయడానికి, అంతర్జాతీయ సరిహద్దుల ద్వారా విత్తన వాణిజ్యాన్ని పెంచడానికి ఇస్టా కీలకపాత్ర పోషించాల్సిన బాధ్యత ఉన్నదన్నారు. తొలిసారి ఆసియా నుండి, అందునా తెలంగాణ నుండి డాక్టర్ కేశవులు ఇస్టా అధ్యక్షుడిగా ఎన్నికకావడం పట్ల గర్విస్తున్నామని అన్నారు. 2022–25 కాలానికి కొత్తగా ఎన్నికైన ఇస్టా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులందరినీ మంత్రి అభినందించారు. ఇది ఒక గొప్ప అవకాశం, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం, ప్రపంచ వ్యాప్తంగా విత్తన పరిశ్రమలకు మద్దతునిచ్చే ఇస్టా వారసత్వాన్ని కొనసాగించడం ఒక పెద్ద బాధ్యతగా చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయోత్పత్తి, ఆహార భద్రతను మెరుగుపరచడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ సమావేశం ఫలితాలనిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# చలన చిత్రం




## ది వారియర్ నుంచి టీజర్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ది వారియర్' నుంచి టీజర్‌ను చిత్రబృందం రిలీజ్ చేయబోతోంది. డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ ఎంటర్ టైనర్ 'ఇస్మార్ట్ శంకర్' . ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించి రామ్ పోతినేనికి మాస్ హీరోగా సాలీడ్ క్రేజ్ తెచ్చిపెట్టింది. చెప్పాలంటే ఈ మూవీతో హిట్ కొట్టి ఒకేసారి పూరి జగన్నాథ్, హీరో రామ్ మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కారు. ఈ సినిమా తరువాత రామ్ నటించిన 'రెడ్'చిత్రం ఆశించిన సక్సెస్‌ను అందుకోలేకపోయింది.



## హీరోయిజం కోసం లాజిక్ లేకుండా చేశారు

### సర్కారు వారి పాటలో మహేశ్ నటన అద్భుతం



శ్రీమంతుడు', 'భరత్ అనే నేను', 'మహర్షి', 'సరిలేరు నీకెవ్వరు' చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న మహేశ్‌బాబు రెండేళ్ల తర్వాత 'సర్కారు వారి పాట'తో ప్రేక్షకుల్ని పలకరించారు. రెండేళ్ల తర్వాత వస్తున్న ఈ చిత్రానికి మహేశ్ ఎలాంటి కథ ఎంచుకున్నారన్నదే ఆసక్తి కలిగించే అంశం. మహి(మహేశ్‌బాబు) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి..లెక్కల మాస్టార్ (తనికెళ్ల భరణి) సహకారంతో ఓ హాస్టల్‌లో చేరి చదువుకుని అమెరికా వెళ్లిపోతాడు. అక్కడి స్థిరపడి వడ్డీకి డబ్బులు తిప్పుతూ ఉంటాడు. తన డబ్బును వడ్డీతో సహా చెల్లించకపోతే అసలు వదిలే టైపు కాదు అతను. అక్కడే మందుకి, క్యాసినోకి అలవాటు పడిన కళావతి(కీర్తి సురేశ్ )తో పరిచయం ఏర్పడుతుంది. క్యాసినో కోసం అబద్ధాలు చెప్పి మహి దగ్గర డబ్బు అప్పుగా తీసుకుంటుంది. ఆమెకు కనెక్ట్ అయిన మహి హెల్ప్ చేస్తూనే ఉంటాడు. ఓ రోజు కళావతి గుట్టురట్టు కావడంతో వడ్డీతో సహా డబ్బు కట్టాలంటాడు. 'నేను ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అనగానే పదివేల డాలర్ల కోసం వైజాగ్‌లో కోటీశ్వరుడు, కళావతి తండ్రి అయిన రాజేంద్రనాథ్ దగ్గర వాలిపోతాడు. తీరా వైజాగ్‌లో దిగి కొన్ని సంఘటలను ఎదుర్కొన్న తర్వాత తనకు ఇవ్వాల్సింది పదివేల డాలర్లు కాదు.. పదివేల కోట్లు అని మీడియా ముందు చెబుతాడు. అసలు ఆ పదివేల కోట్ల కథేంటి. ఎయిర్‌పోర్ట్‌లో మహికి పరిచయమైన నదియాకు ఈ కథకు లింక్ ఏంటి? తనకు రావలసిన డబ్బును మహి రాబట్టాడా లేదా అన్నది మిగతా కథ. బ్యాంక్ నుంచి రుణాలు తీసుకున్న బడా బాబులు సమయానుకులంగా వాయిదాలు చెల్లించకుండా బాగానే ఉంటున్నారు. మధ్యతరగతి జనాలు మాత్రం వాయిదాలు చెల్లించలేక భారంతో నలిగిపోతున్నారు. బడాబాబులు బ్యాంకు రుణాల విషయంలో చేసే తప్పిదాలు సాధారణ మనుషుల తలకు చుట్టుకుంటున్నాయి అన్నది సినిమా ఇతివృత్తం. మహేశ్ చిన్నతనంతో కథ మొదలవుతుంది. 15 వేల బ్యాంక్ రుణం చెల్లించలేక తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకోవడం చూసిన మహి డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకుని అమెరికాలో ఫైనాన్షియర్‌గా స్థిరపడతాడు. అక్కడ పరిచయమైన కళావతితో లవ్, తర్వాత తనకు ఇవ్వాల్సిన పదివేల డాలర్ల కోసం గొడవ, ఆ డబ్బు వసూలు చేయడం కోసం ఫ్లైట్ ఎక్కి వైజాగ్ చేరుకోవడం ఇవన్నీ కూడా లింక్ లేకుండా సాగాయి. ప్రథమార్ధం అంతా మహి, కళావతి, వెన్నెల కిశోర్‌పైనే సాగింది. పదివేల కోట్లు అనే ట్విస్ట్‌తో ఇంటర్వెల్ కార్డ్ వేశారు. అక్కడి వరకూ వేగంగా సాగిన సినిమా సెకెండాఫ్ ప్రారంభం నుంచి సాగదీతగా సాగింది. దర్శకుడు ఎంచుకున్న పాయింట్ బలమైనదే అయినా దానిని ట్రీట్ చేసిన విధానం సరిగా లేదు. పదివేల డాలర్లు తీసుకోవడానికి వచ్చిన హీరో ఎయిర్‌పోర్ట్‌లో పరిచయమైన ఓ వ్యక్తి కోసం, ఆమెను కష్టం నుంచి గట్టెక్కించడం కోసం ఇంత రిస్క్ చేస్తాడా అన్నది రియాలిటీకి దూరంగా ఉంది. కథలో బలం ఉంటే లాజిక్కులు, మ్యాజిక్కులు గురించి ఎవరూ పట్టించుకోరు. నత్తనడకన సాగుతున్న తరుణంలోనే సగటు ప్రేక్షకుడికి లాజిక్కులు గుర్తొస్తాయి. ఈ చిత్రం విషయంలోనూ అదే జరిగింది. కథకు కమర్షియల్ అంశాలను మిళితం చేసి హీరో స్టార్‌డమ్‌కు తగ్గట్లు తెరకెక్కించడంలో దర్శకుడు తడబడ్డాడు. అభిమాను లను దృష్టిలో పెట్టుకుని హీరోపై రాసిన డైలాగ్‌లు ఆకట్టుకున్నాయి. హీరోయిన్ కీర్తి సురేశ్ తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఇప్పటి వరకూ ఆమె గ్లామర్, డీగ్లామర్ పాత్రలు చేసినా ఇలాంటి ట్రెండీ పాత్ర చేయడం ఇదే మొదటిసారి. కీర్తి పాత్ర ఫస్టాఫ్ అంతా బాగానే అలరించింది. సెకెండాఫ్‌లో మాత్రం అక్కడక్కడా దర్శనమిచ్చింది. సముద్రఖని ప్రతినాయకుడిగా అలరించారు. అతిథిగా నదియా పాత్ర కీలకం. ఇంకాస్త నిడివి పెంచి ఉంటే బావుండేది. తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ, రవిప్రకాశ్ పాత్రల మేరకు న్యాయం చేశారు.



## జయంత్ హీరోగా నెల్సన్

యంగ్ డైరెక్టర్ సునీల్ నిమ్మల తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'నెల్సన్'. 'జయంత్'అనే కొత్త కుర్రాడు ఈ చిత్రం ద్వారా టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నాడు. జె.కె.మూవీస్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్-1 గా తెరకెక్కుతున్న థ్రిల్లింగ్ యాక్షన్ తెరకెక్కబోతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు నేడు మొదలయ్యాయి. ఉత్కంఠభరిత కథాంశంతో స్టైలిష్ మేకింగ్ తో రూపొందనున్న ఈ చిత్రంలో అనుషా రాయ్, సెహర్ కృష్ణన్ హీరోయిన్లు. ప్రముఖ నటీనటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించనున్నారు.త్వరలో రాజమండ్రిలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనున్న ఈ చిత్రం వైజాగ్, హైదరాబాద్ లలోనూ చిత్రీకరణ జరుపుకోనున్నట్లు చిత్రయూనిట్ పేర్కొంది.ఆనంద చక్రపాణి, షాని, హరికృష్ణ చదలవాడ, 'పుష్ప' ఫేమ్ రాజు, దివ్య, నవీనారెడ్డి, రాజారెడ్డి, సంతోష్ సింగ్, చందు.బి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అజయ్ పట్నాయక్ సంగీతం అందిస్తున్నారు.

## నటి సోనాలీ బింద్రే రీ ఎంట్రీ



బాలీవుడ్‌లో మొదటి సినిమాకే ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ అందుకున్న సోనాలీ బెంద్రే.. టాలీవుడ్‌లో మహేష్ బాబు, చిరంజీవి, బాలకృష్ణ లాంటి స్టార్ హీరోలతో నటించి సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. మంచి మోడల్ కావడంతో ఎన్నో ప్రొడక్ట్స్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించింది.

## కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు పూజాహెగ్డే



వరుసగా మూడు సినిమాలు ఫెయిలయ్యేసరికి పూజా హెగ్డేకి బ్యాడ్ టైమ్ స్టార్టయ్యిందని, ఆమె కెరీర్ గ్రాఫ్ పడిపోతోందని కామెంట్లు చేశారు చాలామంది. అంత సీన్ లేదని, తన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని మరిన్ని క్రేజీ ప్రాజెక్టుల్ని బ్యాగ్‌లో వేసుకుంటూ ప్రూవ్ చేస్తోంది పూజ. మహేష్, సల్మాన్‌లతో నటించనుంది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలోనూ తానేంటో చూపించ బోతోంది. 5వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి పూజ వెళ్తోంది. యేటా ఫ్రాన్స్‌లో జరిగే ఈ ప్రెస్టీజియస్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ప్రపంచ నలుమూలల నుంచి సినీ సెలెబ్రిటీలు వస్తారు. ఈసారి మన దేశం నుంచి ఐశ్వర్యారాయ్, దీపికా పదుకొనెలతో పాటు పూజ కూడా వెళ్తోంది. మే 17, 18 తేదీల్లో జరిగే ఫెస్టివల్‌లో స్పెషల్ అట్రాక్షన్ కానుంది. స్టార్ హీరోయిన్‌గా సౌత్‌లో చక్రం తిప్పుతున్న పూజకి ఈ ఘనత దక్కడం నిజంగా విశేషమే.



## జగన్‌తో హీరోల భేటీ

### పిక్చర్లు ధమాల్ అంటూ మీమ్స్

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ పిక్ చక్కర్లు కొడుతూ వైరల్ అవుతోంది. దీనిలో ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో పాటు టాలీవుడ్ స్టార్స్ మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రభాస్ వారి సినిమాలు రాధే శ్యామ్, ఆచార్య,తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సర్కారు వారి పాట పోస్టర్స్ ఉండటం ఆసక్తికరంగా ఉంది. కరోనా కారణంగా చిత్రపరిశ్రమ కూడా కుదేలయిన సంగతి తెలిసిందే. థర్డ్ వేవ్ తర్వాత మళ్ళీ చిన్న, మీడియం బడ్జెట్ సినిమాల నుంచి పాన్ ఇండియన్ సినిమాల వరకూ ఒక్కొక్కటిగా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అయితే, ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన టికెట్ రేట్లతో తెలుగు చిత్ర పరిశ్రమకు నష్టాలు తప్పవనే ఉద్దేశ్యంతో టాలీవుడ్ లెజండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి ఆధ్వర్యంలో హీరోలు ప్రభాస్, మహేశ్ బాబు, దర్శకులు రాజమౌళి సహా పలువురు ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమై ఇండస్ట్రీకి ఉన్న ఇబ్బందులను వివరించి టికెట్ రేట్లు పెంచేలా, అదనపు షోలను ప్రదర్శించుకునేందుకు అనుమతులను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జగన్.. చిరంజీవి బృందం కోరిక మేరకు సినిమాలకు టికెట్ రేట్లను పెంచుకునేలా, అదనపు షోలకు అనుమతు లిస్తూ కొత్త జీవోనూ జారీ చేశారు.ఇదిలా ఉంటే..జగన్‌ను కలిసిన స్టార్ హీరోల సినిమాలు వరుసగా ఫ్లాపయ్యాయని..దీనిపై ఓ మీమ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ వైరల్‌గా మారింది. రాధే శ్యామ్ భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు వచ్చి డిజాస్టర్‌గా మిగిలింది. ఆ తర్వాత వచ్చిన మెగాస్టార్ చిరంజీవి - మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌ల మల్టీస్టారర్ సినిమా ఆచార్య ఫ్లాప్ సినిమాల లిస్ట్‌లో చేరింది. ఇక మహేష్ అభిమానులందరితో పాటు కామన్ ఆడియన్స్ అందరూ ఎంతో ఆతృతగా ఎదురుచూసిన సర్కారు వారి పాట భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు వచ్చి..డివైడ్ టాక్ తెచ్చుకుంది. ఈ నేపథ్యంలోనే జగన్‌ను కలిసిన హీరోలకు ఫ్లాప్స్ తప్పలేదు..! అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు.




## కుటుంబ కథాచిత్రాలతోనే సినిమా బతకగలదు

### ఇడంస్ట్రీ ఇది గుర్తించాలన్న నిర్మాత అల్లు అరవింద్

ప్రస్తుతం భారత సినీ పరిశ్రమ చాలా సమస్యల్లో ఉందని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ఎంత పెద్ద స్టార్ హీరోల సినిమాలు విడుదలైనా ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యంగ్ హీరో విశ్వక్‌సేన్ 'అశోకవనంలో అర్జున కళ్యాణం' మూవీ సెక్సెస్ మీట్ కు ఆయన ముఖ్య అథితిగా వచ్చారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ.. ఈ సినిమా తాను కూడా చూశానని, చాలా బాగుందని చెప్పారు. గతంలో కుటుంబం మొత్తం థియేటర్‌కు వచ్చి సినిమాలు చూసేవారు. ప్రస్తుతం థియేటర్లకు వచ్చి సినిమా చూసే అలవాటు పోయింది. శని, ఆదివారాలు వస్తే భార్య, భర్తతో ఏ సినిమాకు వెళ్దామండి అని అడిగేవారు. కానీ ఇప్పుడు ఆ కల్చర్ కనిపించడం లేదు. ఓటీటీలు వచ్చాక అది పూర్తిగా మారింది. సినిమా విడుదలయ్యాక ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూసే కాలం వచ్చింది' అన్నారు. కేవలం కొన్ని సినిమాలు మాత్రమే ప్రేక్షకులను థియేటర్లోకి రప్పిస్తున్నాయని ఆయన పేర్కొ?న్నారు. దీనికంతటికి కారణం ఇండియన్ మూవీ ఇండస్ట్రీ చాలా మారడమేనని అన్నారు. ఇప్పటికైన ఇలాంటి డేంజరస్ ట్రెండ్ నుంచి మనం బయటపడాలి. అంటే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలు తీస్తేనే ప్రేక్షకులు థియేటర్లకు వస్తున్నారు. ఇప్పటికైన ఇండస్ట్రీ అది గ్రహించారు. ప్లీజ్ మీరందరు సినిమాకు వచ్చి చూస్తేనే ఈ సినిమాలు బ్రతకుతాయి' అని అల్లు అరవింద్ చెప్పుకొచ్చారు. ఇక బాలీవుడ్ పరిస్థితి అయితే మరి దారుణంగా ఉందని, అక్కడి స్టార్లు నటించిన చిత్రాలు కనీస ఓపెనింగ్స్ కూడా రాబట్టలేకపోతున్నాయని అల్లు అరవింద్ వ్యాఖ్యానించారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com